సాగులో ఆధునిక టెక్నాలజీని ప్రోత్సహిస్తాం

కలెక్టర్ వెట్రి సెల్వి

దెందులూరు: సాగులో ఆధునిక టెక్నాలజీ వినియోగాన్ని ప్రోత్సహిస్తామని జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి అన్నారు. బుధవారం మండలంలోని పోతునూరు గ్రామంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్‌తో కలిసి పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహించారు. వరిపొలాన్ని పరిశీలించి సాగు, ఖర్చు, తెగుళ్లను రైతులు, అధికారులను జిల్లా కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. వ్యవసాయ అనుబంధ శాఖలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు రైతులకు అందుబాటులో ఉండి ఆధునిక వ్యవసాయ పద్ధతులపై అవగాహన కల్పిస్తూ తక్కువ పెట్టుబడితో అధిక దిగుబడులు సాధించే దిశగా రైతులను చైతన్యపరచాలని సూచించారు. జిల్లాలో ధాన్యం సేకరణ ప్రారంభమవుతున్న దృష్ట్యా రైతులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా కనీస మద్దతు ధర అందించే దిశగా అధికారులు సిద్ధంగా ఉండాలని అన్నారు. ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడుతూ నూతన ప్రభుత్వం రైతుల సంక్షేమ దిశగా అడుగులు వేస్తుందన్నారు. మండల ప్రత్యేకాధికారి శ్రీనివాసరావు, ఆర్డీఓ షేక్ ఖాజావలీ, ఏడీ వై.సుబ్బారావు, తహసీల్దార్ బి.సుమతి, ఎంపీడీఓ వి.శ్రీలత, గ్రామ సర్పంచ్ బోదుల స్వరూప్, మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), మోహన్, లక్ష్మణ్ తదితరులున్నారు.



పోతునూరులో వరిపంటను పరిశీలిస్తున్న కలెక్టర్ వెట్రిసెల్వి, ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్



దుద్దేపూడిలో చేలను పరిశీలిస్తున్న ఏడీఏ ఉషారాజకుమారి

ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన ఉత్పత్తులు

భీమడోలు: ప్రకృతి వ్యవసాయం ద్వారా నాణ్యమైన ఆహార ఉత్పత్తులతో సంపూర్ణ ఆరోగ్యం సిద్ధిస్తుందని భీమడోలు ఏడీఏ పి.ఉషా రాజకుమారి అన్నారు. మండలంలోని భీమడోలు, దుద్దేపూడి గ్రామాల్లో బుధవారం వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో పొలం పిలుస్తుంది కార్యక్రమాలు నిర్వహించారు. దుద్దేపూడిలో పొలంబాట పట్టారు. ఏఓ ఎస్‌పీవీ ఉషారాణి అధ్యక్షత వహించారు. భీమడోలులో నిర్వహించిన కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే గన్ని వీరాంజనేయులు మాట్లాడుతూ వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు వ్యవసాయ అనుబంధ శాఖల అధికారులను రైతుల వద్దకే తీసుకొచ్చి, సాగులో మెలకువలపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. ఏడీఏ ఉషారాజకుమారి మాట్లాడుతూ తక్కువ ఖర్చుతో అధిక దిగుబడులను సాధించి ఆర్థిక స్వావలంబన సాధించేందుకు పొలం పిలుస్తుంది దోహద పడుతుందన్నారు. రైతులు తమ పంటలో 10 శాతం ప్రకృతి వ్యవసాయం చేపట్టాలని సూచించారు. దుద్దేపూడిలో కాషాయం తయారీ చేశారు. కార్యక్రమాల్లో వ్యవసాయ, పశుసంవర్ధక శాఖల అధికారులు, రైతులు పాల్గొన్నారు.

గ్రామాల్లో పొలంబడి

ఉంగుటూరు: మండలంలోని రావులపర్రు, కాగుపాడు ఆయకట్టు పొలాల్లో గురువారం పొలంబడి కార్యక్రమాలు నిర్వహించారు. మందులు ఎక్కువగా వాడడం వల్ల కలిగే నష్టాలను ఏఓ ప్రవీణ్‌కుమార్ వివరించారు. ప్రజాప్రతినిధులు, రైతులు పాల్గొన్నారు.

ఆర్వోబీ నిర్మాణాలపై సాధ్యాసాధ్యాల పరిశీలన

- మ్యాప్‌లు, రోడ్లను కొలిచిన ఇంజినీర్ల బృందం
- సమస్యలు తలెత్తకుండా బ్రిడ్జి నిర్మించాలని కోరిన గ్రామస్తులు



భీమడోలులో మ్యాప్‌లను పరిశీలిస్తున్న ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు



భీమడోలులో రోడ్డు కొలత వేస్తున్న ఇంజినీర్లు

భీమడోలు: ఉంగుటూరు నియోజకవర్గంలో నాలుగు ప్రాంతాల్లో రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టనున్న నేపథ్యంలో మండలంలోని కోడూరుపాడు, భీమడోలు రైల్వేగేటుల వద్ద బుధవారం రైల్వే ప్లానింగ్ ఇంజినీర్లు బృందం సర్వే చేపట్టింది. మండలంలోని జాతీయ రహదారి అనుకుని ఉన్న పూళ్ల సమీపంలోని కోడూరుపాడు, భీమడోలు వద్ద ఆర్‌వోబీల నిర్మాణాలపై సాధ్యాసాధ్యాలను సికింద్రాబాద్‌కు చెందిన రైల్వే ఇంజినీర్లు సాయికుమార్, శ్రీకాంత్‌లు, సీనియర్ సెక్షన్ ఇంజినీర్ శోభూషణ్‌లు వివిధ శాఖల ఉన్నతాధికారులతో కలిసి క్షేత్రస్థాయి పరిశీలన చేశారు. భీమడోలు రైల్వే గేటు సమీపంలో ట్రాఫిక్ ఎక్కువగా ఉండే ప్రాంతం కావడంతో ఆర్‌వోబీ నిర్మాణానికి ఉన్న అడ్డంకులు, నిధులు, స్థల సేకరణ తదితర అంశాలపై చర్చించారు. ఫ్లైఓవర్ నిర్మాణ నమూనా మ్యాప్, స్థల సేకరణ తదితర అంశాలకు సంబంధించిన మ్యాప్‌లను వారు వేర్వేరుగా పరిశీలించారు. జాతీయ రహదారి పక్కనే ఉన్న చేబ్రోలు, కైకరం, పూళ్ల, భీమడోలు వద్ద ఆర్‌వోబీ నిర్మాణాలు చేపట్టే తరుణంలో ప్రత్యేక శ్రద్ధ వహించాలని ఆ బృందానికి రెవెన్యూ, ఆర్‌అండ్‌బీ ఉన్నతాధికారులు సూచించారు. భీమడోలులో పక్కనే జాతీయ రహదారి, గ్రామంలో రాష్ట్రీయ రహదారి ఉన్నందున రెండు శాఖలను సమన్వయపర్చుకుని ప్రతిపాదనలు తయారు చేసుకోవాలని తహసీల్దార్ బి.రమాదేవి, ఆర్ అండ్ బీ ఈఈ కిషోర్‌బాపూజీ, డీఈ గోవింద్ మోహన్‌రావులు సర్వే బృందానికి సూచించారు. భీమడోలు రైల్వే గేటు వద్ద రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సుమారు 800 మీటర్లు, గ్రామంలోని సర్వీసు రోడ్ల నిర్మాణానికి రెండు వైపులా 11 మీటర్ల స్థలం అవసరమవుతుందని, గ్రామకంఠం కాకుండా కొంత భూ సేకరణ చేయాల్సి ఉంటుందని అధికారులు ఓ అభిప్రాయానికి వచ్చారు. భీమడోలు రైల్వే గేటు వద్ద రోడ్డును కొలిచారు.

నిత్యం హైవే దాటాలి

భీమడోలులోని రైతులు ప్రతి రోజు జాతీయ రహదారిని దాటుకుని వెళ్లాల్సి ఉంటుందని, అదే విధంగా జాతీయ రహదారి అనుకుని గోదావరి కాల్వ పక్కనే నివాసం ఉన్న సుమారు 1550 కుటుంబాల ప్రజలు రాకపోకలకు సాగించాలని, ఎటువంటి ఇబ్బందులు లేకుండా సర్వే చేయాలని గ్రామస్తులు కుక్కల ప్రసాద్, ఉండ్రు బెంజిమన్‌లు కోరారు. ప్రతిపాదనలు చేసే తరుణంలో విధిగా తమ గ్రామ పంచాయతీలో రైతులు, ప్రజలు, వ్యాపారులతో కలిసి గ్రామ సభ నిర్వహించాలని వారు కోరారు. కార్యక్రమంలో ఎంపీడీఓ సీహెచ్ పద్మావతిదేవి, విద్యుత్ ఏడీఈ కె.గోపాలకృష్ణ, ఏఈలు జె.భాస్కరరావు, కె.రామస్వామి, రామారావు, వీఆర్వో వెజ్జు వినయ్, నేషనల్ అథారిటీ అధికారులు, వివిధ శాఖల సిబ్బంది పాల్గొన్నారు.

బాల్య వివాహాలను అరికడదాం

భీమడోలు: బాల్య వివాహాలను అరికట్టేందుకు అంగన్‌వాడీ కార్యకర్తలు చిత్తశుద్ధితో పని చేయాలని చైల్డ్ రైట్స్ అడ్వకసి ఫౌండేషన్ జిల్లా కోఆర్డినేటర్ ఆర్ వినోద్‌కుమార్ అన్నారు. గుండుగొలనులోని అంగన్‌వాడీ కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేటు విద్యా సంస్థల్లోని సిబ్బంది, విద్యార్థులతో బుధవారం బాల్య వివాహాల నిరోధంపై ఆయన ప్రతిజ్ఞ చేయించారు. తమ సెక్టార్ పరిధిలో బాల్య వివాహాలను అరికట్టేందుకు తమ వంతు కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా వినోద్ కుమార్ మాట్లాడుతూ బాలలను రక్షించడమే లక్ష్యంగా పని చేయాలని, బాల్య వివాహాల రహిత జిల్లాగా తీర్చిదిద్దడంలో అంగన్‌వాడీలు బాధ్యతగా పని చేయాలని సూచించారు. సూపర్‌వైజర్ కవిత మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వారి హక్కులను కాలరాయడమేనని, బాలికలను చదివిస్తే వారు ఉన్నత స్థితికి చేరుకుంటారన్నారు. కార్యక్రమంలో కమ్యూనిటీ సోషల్ వర్కర్ ఆర్ అమరావతి, టీచర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆశావర్కర్లు పాల్గొన్నారు.



గుండుగొలనులో ప్రతిజ్ఞ చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు, కోఆర్డినేటర్ వినోద్‌కుమార్

ఉపాధి హామీ పనులు పేదలకు వరం

ఉంగుటూరు: ఉపాధి హామీ పనులపై స్థానిక మండల పరిషత్ కార్యాలయం వద్ద బుధవారం ఎంపీపీ గంటా శ్రీలక్ష్మి అధ్యక్షతన విచారణ చేపట్టారు. శ్రీలక్ష్మి మాట్లాడుతూ ఉపాధి పనులు పేదలకు వరంలాంటివని అన్నారు. పీడీ రాము మాట్లాడుతూ ఉపాధి హామీ పనులు అవినీతి రహితంగా నిర్వహించాలన్నారు. తేడాలు వస్తే రికవరీలు చేయిస్తామని హెచ్చరించారు. ఈ ఏడాది 1799 పనులు రూ.15.25 కోట్లతో నిర్వహించామన్నారు. పంచాయతీరాజ్ పనుల్లో రూ.15,500, ఎన్‌ఆర్‌ఈజీఎస్‌లో రూ.18150, ఇతర శాఖల పనుల్లో రూ.13,500 రికవరీకి ఆదేశించారు. సమావేశంలో ఎంపీడీఓ గంజి రాజ్ మనోజ్, డీడీఓ విజయలక్ష్మి, బాషా, ఎస్‌ఆర్‌పీ సూర్యచక్ర, ఎన్‌ఆర్‌ఈజీఎస్ ఏపీఓ మల్లేశ్వరరావులు పాల్గొన్నారు.



ఉపాధి హామీ పనులుపై విచారిస్తున్న జిల్లా అధికారులు

అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత పండిట్ దీన్ దయాళ్

ఉంగుటూరు: అంత్యోదయ స్ఫూర్తి ప్రదాత పండిట్ దీన్ దయాళ్ ఉపాధ్యాయ 108వ జయంతి ఉంగుటూరులో బుధవారం నిర్వహించారు. స్థానిక గ్రీన్ ఆసియా ఇంప్లక్స్ ప్రైవేటు లిమిటెడ్ అధిపతి పసుపులేటి వెంకటరామారావు 100 మందికి వినికిడి పరికరాలను పంపిణీ చేశారు. దీన్ దయాళ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేలు పత్సమట్ల ధర్మరాజు, ఆరుమిల్లి రాధాకృష్ణ, నలమిల్లి రామకృష్ణారెడ్డి, బీజేపీ నాయకులు సోమువీర్రాజు, ఏలూరు జిల్లా అధ్యక్షులు విక్రమకిషోర్, నాయకులు తపన చౌదరి, శరణాల మాలతీరాణి, సర్పంచ్ బండారు సింధు పాల్గొన్నారు.

స్వచ్ఛతా హీ సేవ

చేబ్రోలులో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమం నిర్వహించారు. మొక్కలు నాటారు, పారిశుద్ధ్య కార్మికులను సత్కరించారు. దుస్తులు పంపిణీ చేశారు. పరిశుభ్రతపై ప్రతిజ్ఞ చేశారు. ఎమ్మెల్యే ధర్మరాజు, బీజేపీ, కూటమి నాయకులు పాల్గొన్నారు.



వినికిడి పరికరం అందిస్తున్న ఎమ్మెల్యే ధర్మరాజు

రాష్ట్ర స్థాయి పోటీలకు కైకరం విద్యార్థులు

ఉంగుటూరు: అథ్లెటిక్స్ పోటీల్లో కైకరం విద్యార్థులు ఏడుగురు రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారు. వీరిలో పవన్‌కుమార్, సందీప్, ఎ.సుభాష్, మేరి, యశ్వంత్, వై.ప్రేమకుమార్, ఎం ఆంజనేయులు ఉన్నారు. వీరు జావలన్‌త్రో, లాంగ్‌జంప్, షాట్‌పుట్, రన్నింగ్, హైజంపు, షాట్‌పుట్ తదితర పోటీల్లో ఎంపికై నట్టు హెచ్‌ఎం ఎం.ప్రసాదరావు తెలిపారు. పీడీలను అభినందించారు.

ఉపవాస ప్రార్థన కూడికలు



మన్నా చర్చిలో ప్రసంగిస్తున్న ఫాస్టర్ బెంజిమన్

దెందులూరు: విశ్వాసం, ఉపవాసం నిరంతర ప్రార్థన క్రైస్తవ జీవితంలో ప్రతి ఒక్కరూ అనుసరించాల్సిన అతి ముఖ్యమైన ఘట్టాలని స్థానిక మన్నా చర్చి ఫాస్టర్ బెంజిమన్, కొవ్వలి బేతేలు ఫాస్టర్స్ విలియమ్స్ అన్నారు. కొవ్వలి, దెందులూరులో ఉపవాస ప్రార్థనా పండుగలు బుధవారం నిర్వహించారు. చర్చిల్లో సువార్తీకులు ఉపవాస ప్రార్థనలపై వాఖ్యపరిచయ అందించారు. ఏలూరు, పెదవేగి, దెందులూరు, భీమడోలు, పెదపాడు మండలాల నుంచి అధిక సంఖ్యలో విశ్వాసులు పాల్గొన్నారు.

నేడు కైకరంలో ఆటల పోటీలు

ఉంగుటూరు: కైకరం జిల్లాపరిషత్ హైస్కూలులో గురువారం నియోజకవర్గ స్థాయి ఆటల పోటీలు నిర్వహించనున్నట్టు హెచ్‌ఎం గుళ్ల ప్రసాదరావు తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్ బాల్ బ్యాడ్మింటన్, యోగ, చెస్ పోటీలు నిర్వహిస్తారని, పోటీలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజు ప్రారంభిస్తారని పేర్కొన్నారు.

అభ్యంతరాలుంటే తెలియజేయండి

భీమడోలు: ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ముసాయిదా కొత్త ఓటర్ల జాబితాను స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో ప్రచురించామని, అభ్యంతరాలుంటే తెలియజేయాలని తహసీల్దార్ బి.రమాదేవి బుధవారం కోరారు. తూర్పు, పశ్చిమ గోదావరి టీచర్స్ నియోజకవర్గం ఎన్నికల నిబంధనలన మేరకు ఎన్నికల సంఘం షెడ్యూల్ జారీ చేసిందని పేర్కొన్నారు.

డిప్యూటీ సీఎం ఇంటి వద్ద నిరసన

దెందులూరు: తమ హక్కులను రాష్ట్ర ప్రభుత్వం కాపాడేంత వరకు ఆందోళన విరమించేది లేదని పీహెచ్‌సీ డాక్టర్ల అసోసియేషన్ సంఘం జిల్లా కార్యదర్శి డాక్టర్ పూర్ణ చంద్రరావు అన్నారు. బుధవారం దెందులూరు, గోపన్నపాలెం, పోతునూరు పీహెచ్‌సీల్లో డాక్టర్లు మంగళగిరి వెళ్లి డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్ ఇంటి ఎదుట నిరసన వ్యక్తం చేశారు. అనంతరం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కళ్యాణ్‌కు డిమాండ్లతో కూడిన వినతిపత్రాలను అందించారు.



డిప్యూటీ సీఎం ఇంటి వద్ద నిరసన వ్యక్తం చేస్తున్న జూనియర్ డాక్టర్లు

రఘురామకృష్ణరాజును అరెస్టు చేయాలి

దెందులూరు: ఎమ్మెల్యే రఘురామకృష్ణరాజు అహంకారంతో భారత రాజ్యాంగ నిర్మాత, ప్రపంచ మేధావి డాక్టర్ బీఆర్ అంబేడ్కర్‌ను అవమానించడం క్షమించరాని విషయమని చట్ట సంస్థలు, రాష్ట్ర ప్రభుత్వం జోక్యం చేసుకుని ఆయన్ని అరెస్టు చేయాలని మాలమహానాడు, ఎంఆర్‌పీఎస్, గిరిజన, బహుజన, స్వచ్ఛంద సంస్థలు సంయుక్తంగా ఉద్యమిస్తాయని వేదిక రాష్ట్ర నాయకులు మద్దా భూషణం, కొత్తపల్లి గోపిరాజు అన్నారు. బుధవారం రామారావుగూడెం బస్టాండ్ సెంటరులో రఘురామకృష్ణరాజుకు వ్యతిరేకంగా మాలమహానాడు, ఎంఆర్‌పీఎస్ సంయుక్త ఆధ్వర్యంలో నిరసన వ్యక్తం చేశారు. రఘురామకృష్ణరాజుకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. వారం రోజుల్లో ప్రభుత్వం నిర్ణయం తేల్చకపోతే దళిత, గిరిజన, బహుజనుల ఆగ్రహాన్ని రాష్ట్ర ప్రభుత్వం, రఘురామకృష్ణరాజు చవిచూడాల్సి వస్తుందని హెచ్చరించారు.



నిరసన వ్యక్తం చేస్తున్న మాలమహానాడు, ఎంఆర్‌పీఎస్ నాయకులు

ఇళ్ల నిర్మాణాలు పూర్తిచేయాలి

గణపవరం: గృహనిర్మాణాలను వచ్చే ఏడాది మార్చి 31వ తేదీలోగా పూర్తిచేయాలని, అప్పుడే కేంద్ర ప్రభుత్వం రుణాలు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాలకు జమవుతాయని తాడేపల్లిగూడెం డివిజన్ హౌసింగ్ డీఈ కేవీఎస్ ప్రసాద్ అన్నారు. బుధవారం గణపవరం ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలో గృహనిర్మాణాల ప్రగతిపై రెవెన్యూ, పంచాయతీ, విద్యుత్, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు గృహనిర్మాణశాఖ సిబ్బందితో ఆయన సమీక్ష నిర్వహించారు. గడువులోగా ఇళ్ల నిర్మాణం పూర్తి కాకపోతే కేంద్ర ప్రభుత్వం ఇచ్చే రుణాలు వెనక్కి వెళ్లిపోయే ప్రమాదం ఉందని, లబ్ధిదారుల ఇళ్లవద్దకు వెళ్లి వారికి అవగాహన కల్పించాలని సూచించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు ఈనెల 28వ తేదీన ప్రతి గ్రామంలో మన ఇల్లు, మనగౌరవం కార్యక్రమం నిర్వహించాలని అన్నారు. ఇళ్లనిర్మాణ కార్యక్రమం అమలు తీరు, కాలనీల్లో వసతుల కల్పనపై చర్చించారు. సమావేశంలో ఎంపీడీఓ సూర్యనారాయణ, గణపవరం మండల హౌసింగ్ ఏఈ కిరణ్‌కుమార్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కందుల రూపేష్, ఏపీఎం రాజేష్, పంచాయతీరాజ్ సిబ్బంది, పంచాయతీ కార్యదర్శులు, లేఅవుట్ అధికారులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న హౌసింగ్ డీఈ ప్రసాద్

పరిశుభ్రతతోనే ఆరోగ్యం

గణపవరం: పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడం ద్వారా ఆరోగ్యవంతమైన జీవనం గడపవచ్చునని గణపవరం ప్రభుత్వ డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ అధికారి జి.వెంకటరమణ అన్నారు. బుధవారం గణపవరం మండలం సరిపల్లె గ్రామంలో గణపవరం ప్రభుత్వ డిగ్రీకాలేజి ఎన్ఎస్ఎస్ విద్యార్థులు రోడ్లు, ఖాళీ ప్రదేశాల్లో ప్లాస్టిక్ వ్యర్థాలను ఒకచోట కుప్పగా వేసి దహనం చేశారు. ఇంటింటికీ వెళ్లి ప్లాస్టిక్ వాడకం వల్ల జరిగే అనర్థాలను వివరించారు. ప్లాస్టిక్ బదులుగా కాగితం, గుడ్డ, నార సంచులు వాడాలని సూచించారు. ప్లాస్టిక్ భూమిలో కలవడానికి వందల ఏళ్లు పడుతుందని, భూ కాలుష్యానికి, పర్యావరణ అనర్థాలకు కారణమైన ప్లాస్టిక్ వాడకాన్ని పూర్తిగా మానుకోవాలని అవగాహన కల్పించారు. పంచాయతీ కార్యదర్శి డి.రామాంజనేయులు మాట్లాడుతూ గ్రామంలో పంచాయతీ సిబ్బంది ఇంటింటికీ వెళ్లి తడి, పొడి చెత్తలను సేకరిస్తున్నారని, గ్రామంలో ఎక్కడా చెత్తా, చెదారం పోగులు లేకుండా చర్యలు తీసుకుంటున్నామని చెప్పారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు పాల్గొన్నారు.



సరిపల్లెలో ప్లాస్టిక్ వ్యర్థాలను పోగు చేస్తున్న డిగ్రీ కాలేజీ ఎన్ఎస్ఎస్ విద్యార్థులు

మద్యం తాగి వాహనాలు నడిపితే చర్యలు

ఏలూరు టౌన్: మద్యం తాగి మోటారు సైకిళ్లు నడిపితే కఠిన చర్యలు తప్పవని, భారీ జరిమానాలు విధిస్తామని ఏలూరు ట్రాఫిక్ సీఐ కె.శ్రీనివాసరావు హెచ్చరించారు. ఏలూరు నగరంలోని పాతబస్టాండ్, అజంతా సెంటర్‌లో ఆయన సిబ్బందితో కలిసి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహించారు. ఎస్పీ కొమ్మి ప్రతాప్ శివకిషోర్ ఆదేశాల మేరకు డీఎస్పీ డి.శ్రావణ్‌కుమార్ పర్యవేక్షణలో నగరంలో వాహన తనిఖీలు, డ్రంక్ అండ్ డ్రైవ్ చేపడుతున్నట్టు చెప్పారు.

క్లుప్తంగా

వైఎస్సార్ సీపీ నేతకు పరామర్శ



కుమారిని పరామర్శిస్తున్న కామిరెడ్డి నాని

దెందులూరు: శ్రీరామవరం మాజీ సర్పంచ్, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత కొత్తపల్లి వెంకటేశ్వరరావు కోడలు కుమారిని బుధవారం ఏలూరు వైద్యశాలలో వైఎస్సార్ సీపీ దెందులూరు మండల అధ్యక్షుడు కామిరెడ్డి నాని పరామర్శించారు. వైద్యసేవలపై ఆమె భర్త వైఎస్సార్ సీపీ నేత కోటేశ్వరరావును అడిగి తెలుసుకున్నారు. త్వరతగతిన కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట పార్టీ శ్రీరామవరం గ్రామ కమిటీ అధ్యక్షుడు అక్కినేని శ్రీనివాసరావు ఉన్నారు.

దెందులూరు ఎంపీడీఓగా శ్రీదేవి



కె.శ్రీదేవి, ఎంపీడీఓ

దెందులూరు: దెందులూరు ఎంపీడీఓగా కె.శ్రీదేవి నియమితులయ్యారు. ఈ మేరకు జిల్లా కలెక్టర్ కె.వెట్రి సెల్వి బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. శ్రీదేవి కామవరపుకోట నుంచి రాగా, ఇక్కడ పనిచేసిన ఎంపీడీఓ వి.శ్రీలత కామవరపుకోటకు బదిలీ అయ్యారు. గతంలో దెందులూరు ఎంపీడీఓగా శ్రీదేవి పనిచేశారు.

నేటి నుంచి ఎస్‌జీఎఫ్ టోర్నమెంట్ ఎంపికలు

దెందులూరు: మండలంలోని కొవ్వలి ఉన్నత పాఠశాలలో దెందులూరు నియోజకవర్గ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ టోర్నమెంట్, ఎంపికలు ఈ నెల 26న ఉదయం 9 గంటలకు ప్రారంభమవుతాయని నియోజకవర్గ కోఆర్డినేటర్, సీనియర్ ఫిజికల్ డైరెక్టర్ కె.రాజగోపాల్, కొవ్వలి ఉన్నత పాఠశాల హెచ్‌ఎం శర్మ తెలిపారు. కబడ్డీ, ఖోఖో, వాలీబాల్, బ్యాడ్మింటన్, చెస్ విభాగాల్లో దెందులూరు, ఏలూరు రూరల్, పెదపాడు, పెదవేగి మండలాల్లో ఎంపికైన క్రీడాకారులు తమ ఎలిజిబిలిటీ ఫారం, ఎండీఎం ఎక్విటెన్స్‌తో హాజరుకావాలని రాజగోపాల్ సూచించారు.

గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవ కార్యక్రమాలు



దెందులూరులో ఫిల్టర్‌బెడ్స్ పరిశీలిస్తున్న సర్పంచ్ ఏసమ్మ

దెందులూరు: అన్ని గ్రామాల్లో స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దెందులూరులో వైద్య సిబ్బందితో కలిసి ఫిల్టర్ బెడ్స్‌ను గ్రామ సర్పంచ్ తోట ఏసమ్మ, క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్యచౌదరి, మాజీ ఎంపీటీసీ ఇప్పిలి వెంకటేశ్వరరావు పరిశీలించారు. చల్లచింతలపూడిలో గ్రామ కార్యదర్శి సామ్యూల్, మాజీ సర్పంచ్ ముమ్మడి మోహనరావు, నాయకులు నాగనబోయిన సత్యనారాయణ మొక్కలు నాటారు.

క్షేత్రస్థాయిలో ప్రజాసమస్యల పరిష్కారం

దెందులూరు: అన్ని శాఖల్లోనూ సమర్థవంతమైన సిబ్బంది ఉండటం వల్లే జిల్లాలో వరదలను సమర్థవంతంగా ఎదుర్కోగలిగామని జిల్లా కలెక్టర్ వెట్రిసెల్వి అన్నారు. పోతునూరులో 100 రోజుల పాలన కార్యక్రమంలో ఎమ్మెల్యే చింతమనేని ప్రభాకర్ మాట్లాడారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు మాగంటి నారాయణ ప్రసాద్ (మిల్లుబాబు), క్లస్టర్ ఇన్‌చార్జి గారపాటి కొండయ్య చౌదరి, నాయకులు సుధ, మోహన్, లక్ష్మణ, ఉద్యోగులు ఉన్నారు.

ఇంటి తాళాలు పగులకొట్టి చోరీ

ఏలూరు టౌన్ : ఏలూరు ఆదివారపుపేటలోని రజకుల కాలనీలో దుండగులు ఒక ఇంటి తాళాలు పగులకొట్టి చోరీ చేశారు. రజకుల కాలనీకి చెందిన గోవాడ సురేష్ బుధవారం ఉదయం ఇంటికి తాళాలు వేసి తన తండ్రి భద్రయ్యను ఏలూరు ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రి నుంచి తిరిగి ఇంటికి వచ్చేసరికి ఇంటి తాళాలు పగులగొట్టి ఉన్నాయి. ఇంట్లోని 10 కాసుల బంగారు ఆభరణాలు, వెండి వస్తువులు, రూ.1 లక్ష నగదు అపహరించినట్టు గుర్తించారు. బాధితుడు సురేష్ ఫిర్యాదు చేయగా సీఐ వైవీ రమణ ఆధ్వర్యంలో టూటౌన్ పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

27న రాష్ట్ర రైతు సదస్సు

ఏలూరు (టూటౌన్): ఈ నెల 27న ఉదయం 10 గంటలకు ద్వారకాతిరుమలోని శ్రీకృష్ణ యాదవ కల్యాణ మండపంలో రాష్ట్ర రైతు సదస్సు నిర్వహించనున్నట్టు ఏపీ రైతు సంఘం జిల్లా కార్యదర్శి కె.శ్రీనివాస్ తెలిపారు. స్థానిక పవరుపేటలోని అన్నే భవన్‌లో బుధవారం ఆయన ముఖ్యకార్యకర్తల సమావేశం నిర్వహించారు.

రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు కోమలి



రాష్ట్రస్థాయిపోటీలకు ఎంపికైన కోమలితో పీడీలు

గణపవరం: స్థానిక బాలుర ఉన్నత పాఠశాలలో 9వ తరగతి చదువుతున్న ఎం.హలన్య కోమలి రాష్ట్ర స్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపికైనట్టు పాఠశాల పీడీ పద్మావతి తెలిపారు. బుధవారం పెదవేగి ఏపీ ఎస్‌ఆర్‌ఎస్ స్కూలులో నిర్వహించిన రాష్ట్రస్థాయి పోటీల్లో సాఫ్ట్‌బాల్ పోటీలకు కోమలి ఎంపికైనట్టు పద్మావతి పేర్కొన్నారు. కోమలికి శిక్షణ ఇచ్చిన పీడీ పద్మావతిని హెచ్‌ఎం ఎంఎస్‌ఎస్ మూర్తి, ఉపాధ్యాయులు అభినందించారు.

ఆలయ భూమికి వేలం ఖరారు



రాజుపేటలో భూ వేలం నిర్వహిస్తున్న అధికారులు

పెదపాడు : మండలంలోని రాజుపేట రామలింగేశ్వరస్వామి ఆలయ భూమి 7 ఎకరాల 97 సెంట్ల భూమికి బహిరంగ వేలం నిర్వహించారు. ఆలయ సింగిల్ ట్రస్టీ, ఆలయశాఖ ఇన్‌స్పెక్టర్ ఏసుజన్ కుమార్‌ల ఆధ్వర్యంలో మూడేళ్లకు గాను నిర్వహించిన ఈవేలంలో రాజుపేట గ్రామానికి చెందిన జి.యుగంధర్ రూ.2.45 లక్షలకు దక్కించుకున్నారు. వేలంలో రాజుపేట గ్రామ రైతులు, సింగిల్ ట్రస్టీ గూడూరి రామలింగేశ్వరరావు పాల్గొన్నారు.

వరద బాధితులకు విరాళం

భీమడోలు: గుండుగొలనులోని శ్రీవిద్యాలయ స్కూలు యాజమాన్యం వరద బాధితుల సహాయార్థం సేకరించిన రూ.50 వేలు ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు బుధవారం అందజేశారు. వరద బాధితుల కోసం స్వచ్ఛందంగా విద్యార్థులు, తల్లిదండ్రులు, టీచర్లు సాయం అందించారని పాఠశాల అధినేత గేదెల సురేష్ తెలిపారు. ఆయన నారాయణపురంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో సేకరించిన రూ.50వేలను ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజుకు అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ శిరిబత్తిన కొండబాబు, పెద్దలు పాల్గొన్నారు.